www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 29 మే 2025

5

తూర్పుగోదావరి

డిగ్రీ సెకండ్ ఇయర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ప్రభుత్వ అటానమస్ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్, ఫైనల్ ఇయర్ ఫలితాలను ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు బుధవారం ఆవిష్కరించారు. ఫైనల్ ఇయర్ (ఆరవ సెమిస్టర్‌లో) ఫలితాల్లో బిఎలో 91.30శాతం, బి.కాంలో 94.03శాతం, బిబిఎలో 97.92 శాతం, బిఎస్‌సిలో 87.50శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే సెకండ్ ఇయర్ (నాలుగో సెమిస్టర్) ఫలితాల్లో బిఎ 74.1శాతం, బికాం 81.36శాతం, బిబిఎలో 81.65 శాతం, బిఎస్‌సిలో 80.44 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌తో సహా వివిధ విభాగాల అధిపతులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పి.బాబ్జి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ ఎ.రాజేశ్వరి, కో ఆర్డినేటర్ ఎ.అన్నపూర్ణ పాల్గొన్నారు.

మళ్లీ కరోనా కలకలం

కోనసీమ జిల్లాలో తొలి కేసు నమోదు
అప్రమత్తమైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రజల్లో మళ్లీ కరోరా కలవరం మొదలైంది. దేశంలోనూ, రాష్ట్రంలోనూ కరోనా కేసులు మళ్లీ ఒకొక్కటిగా పెరుగుతున్నాయి. జూన్ నెలలో దేశీయంగా కొవిడ్ నాలుగో దశ తలెత్తవచ్చని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాలుగో వేవ్ కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తాజాగా వైరస్ వ్యాప్తికి తావు లేకుండా ముందే పటిష్ఠ చర్యలు తీసుకోవడం ప్రారంభించింది.డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందిని అప్రమత్తం చేసింది. కరోనా వ్యాప్తి జరగకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై ప్రణాళికను సిద్ధం చేస్తోంది. గతంలో మూడు దశల్లో నమోదైన కేసులు, కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకున్న సందర్భంలో ఎదురైన అనుభవాలను దష్టిలో పెట్టుకొని ఈ మహమ్మారిని నిలువరించేందుకు మరింత పకడ్బందీగా తీసుకోవాల్సిన చర్యలపై దష్టి సారించింది.



ప్రతీ పిహెచ్‌సి పరిధిలో ర్యాపిడ్ టెస్టులు

ప్రతి పిహెచ్‌సి పరిధిలో ర్యాపిడ్ టెస్ట్‌లు అందుబాటులో ఉంచాము. కరోనా అనుమానితులు ఎవరైనా ఉంటే అక్కడ పరీక్షలు నిర్వహిస్తాము. లక్షణాలు గుర్తించిన అనంతరం రాజమహేంద్రవరం జిజిహెచ్‌కు తరలించి ఆర్‌టీపీసిఆర్ టెస్టులు నిర్వహించటంతో పాటు అక్కడే చికిత్స అందించేలా చర్యలు చేపట్టాము. నేటి నుంచి ఐసోలేషన్ వార్డులు అందుబాటులో ఉంటాయి. జిల్లాలో ఇప్పటి వరకూ కొత్త కరోనా కేసులేవి ఇప్పటి వరకు నమోదు కాలేదు. జనసమూహం కలిగిన ప్రాంతాల్లో మాస్కులు ధరించాలి.

- కె. వెంకటేశ్వరరావు, డిఎంహెచ్‌ఒ

మూడు దశల్లో 1,029 మంది మృతి

తొలి రెండు దశల్లో జిల్లాలో పెద్ద ఎత్తున కరోనా కేసులు నమోదయ్యాయి. మొదటి, రెండో దశలలో 3 లక్షలకుపైగా కరోనా బారిన పడ్డారు. అధికారుల గణాంకాల ప్రకారం 1,029 మంది మృతి చెందారు. క్షేత్రస్థాయిలో ఈ సంఖ్యకు 10 రెట్లు అదనంగా మృత్యువాత పడిన విషయం తెలిసిందే. మొదటి రెండు దశల అనుభవతో మూడో దశలో పరీక్షల సంఖ్యను పెంచడం, విస్తతంగా వ్యాక్సినేషన్ జరపడం, ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించడం ద్వారా కరోనా లక్షణాలు కలిగిన వారిని ప్రాథమిక దశలోనే గుర్తించడం, వీలైనంత వరకు వారు ఐసోలేషన్‌లో ఉండేట్లు చేయడం వంటి చర్యలను తీసుకోవడం ద్వారా కరోనాను కట్టడి చేశారు. దీంతో మూడవ దశ నాటికి కరోనా వ్యాప్తి గణనీయంగా తగ్గింది. అయితే ఇప్పటికీ వైద్యాధికారులు కరోనా నియంత్రణకు చర్యలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇతర ప్రాంతాల్లో కేసులు నమోదు అవుతున్నా ప్రస్తుతం అయితే జిల్లాలో ఒక్క కరోనా పాజిటివ్ కేసు లేదు. మొదటి రెండు దశల్లో జిల్లాలో కరోనా వల్ల ప్రాణనష్టం కాస్త ఎక్కువగా ఉన్నా మూడవ దశలో ప్రాణనష్టం అంతగా లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా మరో సారి కరోనా వ్యాప్తి నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమవుతోంది.

అందుబాటులో ఐసోలేషన్ వార్డులు

కోవిడ్ నియంత్రణలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. రామచంద్రాపురంలో తొలికేసు నమోదైన నేపథ్యంలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన వైద్య ఆరోగ్య శాఖతో ఇటీవల సమావేశం నిర్వహించారు. రాజమహేంద్రవరంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఐదు పడకల ఐసోలేషన్ వార్డును సోమవారం నుంచి అందుబాటులోకి తెచ్చారు. అదే విధంగా జిఎస్ఎల్ హాస్పిటల్‌లోనూ ఐసోలేషన్ వార్డు అందుబాటులో ఉంచారు. అదేవిధంగా కాకినాడ జిజిహెచ్ నుంచి 36 ఆర్‌టిపిసిఆర్ కిట్లను జిల్లాకు తీసుకొచ్చి అందుబాటులో ఉంచారు. ఒక వేళ జిల్లాలో కరోనా కేసుల సంఖ్య పెరిగితే ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు వైద్య. ఆరోగ్య శాఖ అధికారులు కార్యాచరణ రూపొందించుకొని సిద్ధంగా ఉన్నారు. ర్యాపిడ్, ఆర్‌టీపీసీఆర్ పరీక్ష కిట్లతో పాటు ప్రత్యేక కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సిద్ధం చేశారు.

తనిఖీలు నిర్వహిస్తున్న జెసి

మార్గదర్శకాలు పాటించాలి : జెసి

2వ రోజు థియేటర్లలో కొనసాగిన తనిఖీలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

థియేటర్ యాజమాన్యాలు మార్గ దర్శకాలు కచ్చితంగా పాటించాలని, ధరల పట్టిక ప్రముఖంగా ప్రదర్శించాలని జెసి ఎస్.చ్నిరాముడు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక గీతా అప్సర, శ్యామల, స్వామి థియేటర్లలో ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, అగ్ని మాపక అధికారి కె.శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వి.రుక్మయ్య, అర్బన్ తహశీల్దార్ పాపారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.అన్నవరం, విద్యుత్, పోలీసు అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో జెసి మాట్లాడారు. జిల్లాలో సినిమా హాళ్ల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గ దర్శకాలను అనుసరించాలన్నారు. ఆయా థియేటర్ల నిర్వహణ తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 40 సినిమా థియేటర్లు ఉన్నాయని, రాజమండ్రి డివిజన్‌లో 25, కొవ్వూరు డివిజన్‌లో 15 ఉన్నాయన్నారు. థియేటర్లలో ఆహార, పానీయాలు, ధరలపై నియంత్రణ ఉండాలని, టికెట్ల ధర పెంపు కావాలంటే ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మాత్రమే అనుమతులు ఇస్తామన్నారు. సినిమా హాళ్ల నిర్వహణ పకడ్బందీగా ఉండాలనీ స్పష్టం చేశామన్నారు. విద్యుత్ సరఫరా వైరింగ్‌కు చెందిన ధ్రువీకరణ పత్రం, అగ్ని ప్రమాద నివారణ చర్యలు, చేపట్టిన తనిఖీల నివేదిక, థియేటర్లలో ఆహార పానీయాల నాణ్యత, అధిక ధరకు తినుబండారాలు, థియేటర్ ఫిట్‌నెస్, ఫైర్ సేఫ్టీ, బ్లాక్ టికెట్ల వ్యవహారం, శానిటేషన్, నిర్వహణ వ్యవస్థ, తాగునీటి వసతి తదితర అంశాలపై తనిఖీలు చేశామన్నారు. ఏయే ప్రాంతాల్లో నిర్వహణ విషయంలో అలక్ష్యం వహిస్తున్నారో, ఎక్కడైతే ప్రభుత్వం నిర్దేశించిన మార్గ దర్శకాలను ఉల్లంఘనకు పాల్పడడం జరిగిందో, గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నామన్నారు.

మోడల్ డిఎస్‌సి పరీక్ష విజయవంతం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

డివైఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మోడల్ డిఎస్‌సి పరీక్ష విజయవంతమైంది. వివిధ ప్రాంతాలకు చెందిన డిఎస్‌సి అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి మాట్లాడారు. అభ్యర్థులందరూ ప్రణాళిక బాధంగా చదుకోవాలన్నారు. ఏ సబ్జెక్టులో వెనకబడుతున్నామో గుర్తించి దాన్ని అధిగమించేందుకు ప్రాణాళిక వేసుకోవాలన్నారు. ప్రతి రోజూ జనరల్ నాలెడ్జిపై దృష్టి పెట్టాలన్నారు. న్యూస్ పేపర్, న్యూస్ చూసి ఎప్పటికప్పుడు నోట్స్ తయారు చేసుకోవాలన్నారు. డిఎస్‌సి పరీక్ష బాగా రాసి ఉపాధ్యాయులుగా ఎంపికావాలని ఆకాంక్షించారు. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరంలోని మూడు కేంద్రాల్లో మోడల్ డిఎస్‌సి పరీక్ష ఉదయం 10 నుంచి 1గంట వరకు జరిగిందన్నారు. ఈ మోడల: డిఎస్‌సి పరీక్ష పత్రాన్ని విద్యావేత్త, మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు తయారు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, రాజేశ్వరి, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు టి.రాజేష్, బి.పవన్, బి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి - రాజానగరం

ప్రతి మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదగాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు మండలంలో కానవరం జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ సెర్ప్, ఆధ్వర్యంలో మహిళా సంఘాల జీవనోపాదుల అభివృద్ధి నిమిత్తము వార్షిక రుణ జీవనోపాధుల ప్రణాళికను తయారు చేసుకునే విధానాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. అవసరమైన నైపుణ్యాభివృద్ధి కోసం తగిన శిక్షణ పొందాల్సి ఉంటుందన్నారు. బ్యాంక్ లింకేజ్, స్త్రీనిధి, ఉన్నతి, సామాజిక పెట్టుబడి రుణాలను విరివిగా పొంది ముందుగా వార్షిక రుణ ప్రణాళికలు తయారు చేసుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్ఎన్.మూర్తి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు ఎ.శ్రీనివాసరావు, ఇ.శ్రీనివాసబాబు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ జి.సునీత, క్లస్టర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలంలోని ఉచిత ఇసుక ర్యాంపులు, అలాగే పట్టా భూముల్లో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపుల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, ఈ మేరకు అధికారుల పర్యవేక్షణ ఉండాలని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇసుక రవాణా చేసే లారీలకు బరకాలు తప్పని సరిగా ఉండాలన్నారు. ప్రజల ప్రాణాలకు భద్రత ఇవ్వడమే ముఖ్యమని తెలిపారు. రహదారులపై ఇసుక పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, తద్వారా ప్రమాదాలు నివారించాలని ఆదేశించారు. ఈ జాగ్రత్తలు పాటించని పక్షంలో సంబంధిత నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక తహశీల్దార్, ఎస్ఐలను ఆదేశించారు.

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

ప్రజాశక్తి-కడియం

కడియపులంక జిల్లా పరిషత్ హైస్కూల్లో 1998-99 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో బుధవారం కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సందడి చేశారు. ఒకరికొకరు మళ్లీ పరిచయం చేసుకుంటూ యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ఇరవై ఆరేళ్ల తర్వాత వీరంతా కలుసుకోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎంతో ఉత్సాహంతో గడిపారు. ఆనాడు విద్యా బుద్దులు నేర్పిన గురువులు సత్యనారాయణ, శ్రీనివాస్, సూర్య, బేగం, నాగకుమారి, సాయిబాబా, జోషి, బుజ్జిబాబులను సత్కరించారు.

ఇన్నోవేషన్ హబ్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బొమ్మూరులో ఏర్పాటు చేయనున్న రాజమహేంద్రవరంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్టీఐహెచ్) పనులను కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మొత్తం 4,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆర్‌టిఐహెచ్ భవనాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. జూన్ 12న ప్రారంభానికి సన్నాహం చేస్తున్నామని తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కి సంబంధించి ఇప్పటికే బోర్డు కమిటీ ఒకటి ఏర్పాటైందన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్ఎంసి కమిషనర్ సభ్యులుగా ఉన్నారన్నారు. అలాగే బోర్డు కమిటీ గవర్నింగ్ వ్యవస్థకు గ్రీన్ కో ఎనర్జీ, ఒఎన్‌జిసి, గెయిల్, అవంతి తదితరులు ప్రమోటర్లుగా ఉంటారన్నారు. స్కిల్స్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్, స్టార్టప్స్, ఫెసిలిటేషన్ కేంద్రంగా ఈ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు కానుందని తెలిపారు. యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో సరైన దిశా నిర్దేశం చేయడం, వారికి తగిన నాలెడ్జి అందించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అటు జిల్లాలో ఇటు నగరంలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి ఈ ఇన్నోవేషన్ హబ్ ఎంతగానో దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఇఇ మదర్సా అలీ షేక్, ఇతర అధికారులు ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

ర్యాంపులో పనుల కోసం కూలీల ఆందోళన

ప్రజాశక్తి - సీతానగరం

తూర్పు గోదావరి జిల్లా వంగలపూడి ఇసుక ర్యాంపులో పనులు కల్పించాలంటూ బుధవారం వందలాది మంది కూలీలు ఆందోళనకు దిగారు. జట్టు కూలీలుగా నమోదైన సంఘానికి చెందిన తాము తీవ్ర వివక్షకు గురవుతున్నామని, తమకు పనులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జట్టు కూలీలుగా నమోదు చేసుకున్న సంఘంలో వంద మందికి పని కల్పిస్తామని గతంలో తీర్మానించారు. అయితే ప్రస్తుతం కేవలం పది మంది మేస్త్రీలు మాత్రమే రోజువారీగా పనులు చేసుకుంటున్నారని, మిగిలిన కూలీలకు అసలు పనులు దక్కడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఈ విషయంపై తక్షణమే చర్యలు తీసుకుని, ర్యాంపులో ఉన్న కూలీలందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పనులు కల్పించకపోతే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

లైంగిక వేధింపుల నిషేధ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం-2013పై ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లకు బుధవారం జిల్లా ప్రధాన న్యాయస్థానం ఆవరణలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడారు. పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించేందుకు రూపొందించిన చట్టంలోని వివిధ అంశాలను వివరించారు. లైంగిక వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతీ కార్యాలయంలో ఈ విషయాలపై ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు వివిధ అవగాహన కలిపించాలన్నారు. సంస్థలో లైంగిక వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకునేందుకు ఆ సంస్థకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులు, తదితరులతో కూడిన "అంతర్గత ఫిర్యాదుల కమిటీ" ఉంటుందని తెలిపారు. పని ప్రదేశాల్లో మహిళలకు ఎలాంటి లైంగిక వేధింపులు ఎదురైనా వెంటనే ఈ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. అటువంటి ఘటనలపై విచారణ జరిపిన తరువాత తగు రీతిలో కమిటీ చర్యలు తీసుకుంటుందని వివరించారు.

రూ.24.62 కోట్లతో రహదారి పనులు

ప్రజాశక్తి రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో రహదారుల అభివృద్ధి నిమిత్తం నాబార్డు ద్వారా 13 పనులకి సంబంధించి రూ.24.62 కోట్ల నిధులను మంజూరు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల పరిధిలో 38.61 కిలో మీటర్ల మేర రహదారులు నిర్మాణం, మరమ్మతులు చేపట్టేందుకు ఆ నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రంగంపేట మండలంలో మర్రిపూడి-ఆర్‌బి పట్నం, అనపర్తి మండలం దుప్పలపూడి - కాపవరం రహదారి పునర్నిర్మాణ పనులు, రాజమండ్రి రూరల్ నియోజక వర్గంలో రాజమహేంద్రవరం రూరల్ కాతేరు - స్నాన ఘట్టం వరకు, కడియం మండలంలో జెరుగుపాడు, కడియం, కె సావరం, మాధవరాయుడు పాలెం రహదారులు, సీతానగరం మండలం పురుషోత్తమ పట్నం వరకు, గోకవరం మండలంలో ఆర్ ఎర్రపాలెం వరకు, నల్లజర్ల మండలం పరిధిలో చోడవరం - గుండెపల్లి, కంచెర్లగూడెం - సంజీవపురం రహదారికి, కొవ్వూరు మండలంలో పెనకన మెట్ట - కుమారదేవరం బిటి రోడ్డు, ఉండ్రజవరం మండలం పైడిమర్ర - సత్యవాడ, పెరవలి మండలంలో కానూరు-నడుపల్లికోట , నిడదవోలు మండలంలో సింగవరం - నందమూరు, పెరవలి మండలంలో కాపవరం - కొత్తపల్లి ఆగ్రహం రహదారి పనులు నిర్వహించనున్నామని తెలిపారు.

టవర్ నిర్మాణ పనుల అడ్డగింత

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

సిబ్బందిని అడ్డుకుంటున్న స్థానికులు

నిడదవోలం మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో జనావాసాల మధ్య చేపట్టిన టవర్ నిర్మాణ పనులను స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఒక ప్రముఖ కంపెనీకి చెందిన టవర్‌ను ఇళ్ల మధ్యన నిర్మించ డానికి పనులు చేపట్టారన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే దీన్ని నిర్మిస్తునానరన్నారు. టవర్ వల్ల ఉత్పన్నమయ్యే రేడియేషన్‌తో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని గ్రామస్తులు తెలిపారు. ఎట్టి పరిస్థితిలోనూ టవర్ నిర్మాణాన్ని జరగబోనీయమని వారు స్పష్టం చేశారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యనిర్వణ అధికారి జి.నాగరాజును వివరణ కోరగా తమ కార్యాలయానికి వచ్చి ఏ సంస్థ కూడా టవర్ నిర్మాణానికి అనుమతులు తీసుకోలేదన్నారు. ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని, ఆ బాధ్యత సిబ్బందిపై ఉందని గృహ నిర్మాణ శాఖ ఇఇ చంద్రశేఖర్ తెలిపారు. తాళ్లపూడి ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి ఉద్యోగి టార్గెట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. తాళ్లపూడి మండలంలో 154 ఇళ్ల నిర్మాణాలకు 83 పూర్తి చేశామన్నారు. మరో 71 నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో డిఇ శేఖర్‌బాబు, ఎఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గిట్టుబాటు ధరలు కూడా పుష్కలంగా వుంటే బాగుండు

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ జయంతిని జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టారు.

రాజమహేంద్రవరం రూరల్ మండలం కలెక్టరేట్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.చిన్నరాముడు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్, ఇతర అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చాగల్లులో...

తొలుత కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను వారు సందర్శించారు. **ఉండ్రాజవరం** మండలంలో ఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు ఆయా గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలోటిడిపి నాయకులు కె.శివ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టిసి మేనేజర్ ఎం.రామచంద్రరావు, సిఎస్ ప్రసాద్, గ్రంథాలయ పాలకుడు కృష్ణారావు పాల్గొన్నారు. **నిడదవోలు రూరల్** కోరుమామిడిలో టిడిపి

తాళ్లపూడిలో...

గ్రామ అధ్యక్షులు మట్టపర్తి చంద్రరావు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి మండల మాజీ మాజీ అధ్యక్షులు మారిశెట్టి వీరవెంకటసత్యనారాయణ, పాతూరి నాగేశ్వరావు వేములపల్లి వెంకట సుబ్బారావు ఉప్పల కాశీ రాంబాబు దొమ్మేటి దేవి తదితరులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్‌టిఆర్ జయంతిని నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు, కార్యాలయ పర్యవేక్షణ అధకారి నిర్మల, గహ నిర్మాణ శాఖ ఇఇ శేఖర్, డిఇ శేఖర్ బాబు, తదితరులు పాల్గొన్నారు. మలకపల్లిలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి నాయకులు మద్దిపాటి ప్రకాశం, అన్నదేవరపేటలో మైనం వెంకటేశ్వరరావు, కవల రామాంజనేయులు, పోచవరంలో యువగళం నాయకులు అనపర్తి ప్రసాద్, పెద్దేవంలో కె.శంకరం ఆధ్వర్యంలో జయంతులు జరిగాయి. **చాగల్లు** ప్రధాన కూడలిలో ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎఎంసి మాజీ ఛైర్మన్ ఆళ్ల హరిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. నేలటూరు, గౌరీపల్లి, మల్లవరం, చంద్రవరం, ధారవరం, బ్రాహ్మణగూడెం, కలవలపల్లి గ్రామాల్లో వృద్ధులు, వికలాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. కె.సతీష్, టి.హరిచంద్రప్రసాద్, ఎస్‌సి

రాజమహేంద్రవరం రూరల్‌లో కలెక్టర్ తదితరుల నివాళి

సెల్ మండల అధ్యక్షుడు జొన్నకూటి సుబ్బారావు, నందిగం శ్రీను, తాళ్లూరి శ్రీనివాస్, అల్తాఫ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. **కడియం**లో వెలుగుబంటి నాని, కడియపులంకలో మార్గాని సత్యనారాయణ, దుళ్లలో ముమ్మిడి దేవినాగేశ్వరరావు, మురమండలో ప్రత్తిపాటి రామారావుచౌదరి తదితరుల ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు జరిగాయి. **గోకవరం** టౌన్‌లో టిడిపి మండల కన్వీనర్ మంగరౌతి రాము, సీనియర్ నాయకులు గాజగం సత్తిబాబు, రాజమండ్రి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బత్తుల సత్తిబాబు, మాజీ జడ్పిటిసి పాలూరి బోసు, గోకవరం టౌన్ కన్వీనర్ పైలా శ్రీనివాసరావు, గునిపే భరత్ , పాలాడి శ్రీను, చిటికెల పాండు, తదితరుల ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. **దేవరపల్లి** యర్నగూడెంలో నందమూరి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బెల్టుషాపులపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంపయర్రంపాలెంలోని బెల్టుషాపులపై పోలీసులు దాడి చేశారని ఎస్ఐ వివిఎన్వి.పవన్‌కుమార్ తెలిపారు. బెల్టు షాప్ నిర్వహిస్తున్న కాకర్ల వంశీకృష్ణను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని నుంచి 12 కింగ్ ఫిషర్ బీర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఎక్కడైనా నాటు సారా, మద్యం అక్రమ అమ్మకాలు, జూదాలు నిర్వహిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచాంర ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

'పంపా'లో బాలుడు మృతి

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం పంపానదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు ఒక బాలుడు మృతి చెందినట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ప్రకారం..కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామం చెందిన వాసంశెట్టి వెంకటరమణ తన కుటుంబ సభ్యులతో సత్యదేవుని దర్శనం కోసం ఆటోలో అన్నవరం వచ్చాడు. పంపా నదిలో స్నానం ఆచరించి కొండపై వెళ్దామని పంపానదిలో స్నానం చేస్తుండగా వారిలో ముగ్గురు యువకులు మునిగిపోయారు. వారిలో ఇద్దరిని రక్షించగా, మరోక బాలుడు చరణ్ తేజ(16) గల్లంతయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉండే గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటన ప్రాంతానికి కొద్ది దూరంలో చరణ్‌తేజ మృతదేహం లభించింది. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు ఆ బాలుడి మృతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి ఊబలంక గ్రామ శివారు ఏటిగట్టు వద్ద బుధవారం ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి అర కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు రావులపాలెం టౌన్ సిఐ ఎం.శేఖర్ బాబు తెలిపారు. ఏటిగట్టు పక్కన రావి చెట్టు వద్ద ఊబలంకకు చెందిన సత్తి భాస్కర వీర రెడ్డి, పెసంగి సింహాద్రి, రావులపాలెంకు చెందిన సిరిగినీడి పవన్, సత్తి వీర సత్యా సాగర్ రెడ్డి, మల్లిడి కిరణ్ రెడ్డి, ఆత్రేయపురం మండలం మెర్లపాలెం శివారు వాసంశెట్టి వారి పాలెంకు చెందిన వాసంశెట్టి చంద్రమౌళి, ర్యాలికి చెందిన మామిడిపల్లి నాగరాజులు అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పోలీసులు వారిని విచారించారు. వారి వద్ద తాగడానికి, అమ్మడానికి సిద్ధంగా ఉంచిన రూ.5 వేల విలువైన 500 గ్రాముల గంజాయి గుర్తించి తహశీల్దార్ బియం ముక్తేశ్వరావు, ఆర్ఐ సూర్యాకాంతం ఆధ్వర్యంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని సిఐ తెలిపారు.

రఘునాథపురంలో చోరీ

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలో రఘనాథపురానికి చెందిన బల్లి వెంకటేశులు ఇంట్లో దొంగలు ప్రవేసించి బంగారు, వెండి వస్తువులు దొంగిలించారు. వెంకటేశులు కుటుంబం ఈ నెల 25న తిరుపతి వెళ్లారు. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని పక్కింటి వారు సమాచారం ఇవ్వడంతో బుధవారం హుటాహుటిన వచ్చారు. ఇంటిని పరిశీలించగా బీరువాలో ఉన్న 64 గ్రాముల బంగారం, 850 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. వీటి విలువ రూ.1.77 లక్షలు ఉంటుందన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగార్జున తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-కడియం

ఒంటరిగా నివసిస్తున్న మహిళపై పట్టపగలు దాడి చేసి చోరికి పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులను కడియం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడియం మండలం వేమగిరి దేవి జనార్ధన్ నగర్‌లో దుళ్ల అనంతలక్ష్మి ఒంటరిగా నివాసం ఉంటుంది. ఈ నెల 26న ముగ్గురు వ్యక్తులు ఆమె ఇంటికొచ్చి దాడి చేసి నగదు, వెండి, బంగారం వస్తువులు దోచుకుపోయారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ధనలక్ష్మి ప్రసన్న, ఎస్ఐ దుర్గాప్రసాద్ నిందితులను కడియం రైల్వే స్టేషన్ సమీపంలో పట్టుకున్నారు. చోరీ చేసిన వస్తువులు, నగదును రికవరీ చేశారు. న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని సౌత్ జోన్ డిఎస్‌పి అభినందించారు.

లారీ ఢీకొనడంతో నాలుగు పశువుల మృత్యువాత

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు శివారు మీనానగరంలో మంగళవారం రాత్రి లారీ ఢీకొనడంతో నాలుగు పశువులు మృత్యువాత పడ్డాయి. టిప్పర్ లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో రెండు గేదెలు, ఒక దూడ, ఒక దున్నపోతు మృత్యువాత పడ్డాయన్నారు. గేదెల యజమాని కలేరియా మంగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

లెదర్ ఫుట్ వేర్ తయారీపై శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో షెడ్యూల్డు కులాల్లో చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో లీడ్ క్యాప్, సీడాప్ ద్వారా లెదర్ ఫుట్ వేర్ తయారీ కోర్సులో 60 రోజుల పాటు శిక్షణకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కార్యనిర్వాహక సంచాలకులు జె.సత్యవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లెదర్ స్టిచ్చింగ్ ఆపరేటర్ లెదర్ ఫుట్ వేర్ లెదర్ కట్టర్ ఫుట్ వేర్ నిమిత్తం 45 నుంచి 60 రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. పదోతరగతి పాసై, 18 నుంచి 35 ఏళ్లలోపువారు అర్హులన్నారు. గుంటూరు జిల్లా నల్లపాడులో శ్రీకృష్ణసాయి ఎడ్యుకేషన్ సొసైటీలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతితో కూడిన సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన ఎస్‌సి అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం నిమిత్తం 9030924569, 7981349691 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన నర్సరీ అసోసియేషన్

ప్రజాశక్తి-కడియం

కడియపులంకకు చెందిన సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప ఆధ్వర్యంలో సభ్యులు మంత్రి కందుల దుర్గేష్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అమరావతి ప్రాంతంలో నర్సరీ రంగం అభివృద్ధి, బోటానికల్ గార్డెన్, ఎకో టూరిజం, ప్లాంట్ బయో డైవర్సిటీ కేంద్రం ఏర్పాటు కోసం 10 ఎకరాల భూమిని కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఉద్యానవన మొక్కల పెంపకం ద్వారా రాష్ట్ర పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. అమరావతిలో

మంత్రికి మొక్కను అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

థాయిలాండ్ తరహాలో చాటు చక్ లాంటి మార్కెట్‌ను కూడా ఏర్పాటు చేయాలనుకుంటున్నామని తెలిపారు .దీని ద్వారా చిన్న, సన్నకారు నర్సరీ రైతులు అభివృద్ధి చెందుతారని మంత్రికి వివరించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.నారా లోకేష్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని మంత్రి దుర్గేష్ వారికి హామీ ఇచ్చారు.కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిల్ ఫండ్స్ ద్వారా నర్సరీ అసోసియేషన్‌కి జెసిబిని సమకూర్చాలని మంత్రికి విన్న వించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతి నిధులు కొండేపూడి నాగు, తాడాల నాగ్వశ్వరావు, గాజుల రత్తయ్య, రత్నం బాబ్జి, గాద నాగేశ్వరావు, కె.వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - నల్లజర్ల

ఆరోగ్యం పట్ల మహళలు జాగ్రత్తగా ఉండాలని ఆమెన్ ట్రస్ట్ అధినేత ఇవాంజలిన్ అశోక్ అన్నారు. ప్రపంచ మహిళల ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నల్లజర్లలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యాన్ని ఏమాత్రం లెక్కచేయకుండా కుటుంబ ఆరోగ్యమే తమ లక్ష్యంగా ఎందరో మహిళలు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. అలాంటి మహిళలు రక్తహీనత, థైరాయిడ్, పలు రకాల క్యాన్సర్ రోగాలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ మహిళా ఆరోగ్యంగా వుండాలనే లక్ష్యంతో తమ సేవా సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతినెలా ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నామని చెప్పారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వాసుపత్రి కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ నేమాని వెంకట శాస్త్రి మహిళల్లో వచ్చే పలు వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

ఇకట్లు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు పోషకాహార కిట్లు, ఔషదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జివివి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బి.ఫార్మసీ ఫలితాల్లో ఆదర్శలో నూరుశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-గోకవరం

బి.ఫార్మసీ నాలుగో సంవత్సరం సెకండ్ సెమిస్టర్ ఫలితాల్లో ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాథరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని పైల రాజేశ్వరి 8.91 గ్రేడ్ పాయింట్లు సాధించిందన్నారు. ఈ సంవత్సరం విద్యార్థులు మొదటి సెమిస్టర్‌లోనూ నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఆదర్శ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ కనకరాజు మాట్లాడుతూ ఆదర్శకు ఇటువంటి ఘన విజయం అందించిన అధ్యాపక బృందానికి, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ నాగమణి మాట్లాడుతూ తమ విద్యాసంస్థలో విద్యతో పాటూ ఇతర కార్యక్రమాల్లోనూ నైపుణ్యత సాధించేలా బోధన ఉంటుందన్నారు. కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపక బృందం కామేష్, ప్రేమ్ కుమార్, డాక్టర్ పైడిరాజు, సంకీర్తన, దీప్తి, భార్గవి, విజయ్ కుమార్, ప్రీతి, శిరీష, అలేఖ్య, దీపిక, కళాశాల బోధనేతర సిబ్బంది తదితరులు విద్యార్థులను అభినందించారు.

స్వర్ణాంధ్ర నిత్యాన్నదాన సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, రోగుల బంధువులకు నిత్య అన్నదానం చేయడం అభినందనీయమని విశ్రాంత డిఎస్‌పి ఎం.వీరారెడ్డి అన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమంలో వీరారెడ్డి పాల్గొని భోజనాలు వడ్డించారు. గత 27 సంవత్సరాలుగా స్వర్ణాంధ్ర చేస్తున్న సేవల్లో అనేకసార్లు పాల్గొన్నానని, అయితే నిత్యాన్నదాన సేవలో అవసరార్థుల ఆకలి తీర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. దూర ప్రాంతాల నుంచి ఆసుపత్రి సేవల కోసం వచ్చేవారికి స్వర్ణాంధ్ర అన్నదానం అవసరానికి ఉపయోగపడుతుందని ప్రశంసించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి వీరారెడ్డి తండ్రి కీర్తిశేషులు మేడపాటి కృష్ణారెడ్డి పేరున అన్నదానం చేయాలని స్వర్ణాంధ్రకు రూ.15 వేలు విరాళాన్ని అందించారు. ఏజెన్సీ మరియు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అవసరార్థులకు స్వర్ణాంధ్ర నిత్యాన్నదానం ఎంతగానో ఉపయోగపడుతుందని నిర్వాహకులు రాంబాబును అభినందించారు. స్వర్ణాంధ్ర సిబ్బంది వాలంటీర్లు అన్నదానంలో పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కార్మిక హక్కుల పరిరక్షణ కోసం జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెని విజయవంతం చేయాలని మండల సిఐటియు ప్రధాన కార్యదర్శి కెవివి.సత్యనారాయణ కోరారు. బుధవారం వాకతిప్ప గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి ప్రజలకు సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌తో కార్మికుల హక్కులు హరించబడతాయని అన్నారు. హక్కులను కాపాడుకునేందుకు జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో. భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల కార్యదర్శి సిహెచ్.సాంబశివకుమార్, సిఐటియు మండల అధ్యక్షులు కె.నాగేశ్వరరావు, ఎ.వాసు, ఎ.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిని తొలగించిన వారిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - కాట్రేనికోన

తమపై దాడి చేసి తమ ఇంటిని తొలగించిన వారిని అరెస్ట్ చేయాలని బాధిత కుటుంబం డిమాండ్ చేసింది. కొత్తపాలెంకు చెందిన కాలాడి అచ్చిబాబు వర్గీయులు మొల్లేటిమొగకు చెందిన కాలాడి సూరిబాబు కుటుంబంపై దాడి చేశారు. తాటాకు ఇంటిని పూర్తిగా తొలగించి ఉప్పుటేరులో పడవేసి తెల్ల వారేసరికి రేకుల షెడ్ నిర్మించారు. బాధితులు ఫిర్యాదుపై వెంటనే పోలీసులు స్పందించి దాడి చేసిన వారిని అరెస్టు చేసి ఉంటే రేకులు షెడ్ వేసి ఉండే వారు కాదని బాధితులు, స్థానికులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే పల్లంకుర్రు పంచాయతీ శివారు మొల్లేటిమొగకు చెందిన కాలాడి సూరిబాబు పూర్వీకులు నుంచి వచ్చిన స్థలంలో తాటాకిల్లు కట్టుకుని భార్య రామలక్ష్మి, ఇద్దరు అమ్మాయిలు నివాసం ఉంటున్నారు. అయితే ఈస్థలం వివాదంపై కోర్టులో కేసు నడుస్తోంది. కోర్టులో కేసు ఉండగా కొత్తపాలెంకు చెందిన కాలాడి అచ్చిబాబు వర్గం సుమారు 20 మంది కాలాడి రామలక్ష్మి, పిల్లలుపై దాడి చేసి ఇంటికి తొలగించి ఉప్పుటేరులో పడవేశారు. మొల్లేటి మొగకు చెందిన వ్యక్తి ఇంటి పై దాడిస్తున్న సమయంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు వెళ్లి సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దాడిలో గాయపడిన కాలాడి సూరిబాబు కుటుంబం పోలీసులకు, గ్రీవెన్సుకు పిర్యాదు చేసి ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. తొలగించిన నా ఇంటి స్థలంలో తెల్లవారే సమయంనకు రేకుల షెడ్ వేసేశారని బాధిత కుటుంబం వాపోతోంది. సంబంధిత అధికారులు నుంచి తమకు రక్షణ లేకపోవడంతోనే తొలగించిన స్థలంలో రేకుల షెడ్ వేశారని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. నిలువ నీడ లేక కట్టు బట్టలతో భార్య, పిల్లలుతో రోడ్డున పడ్డామని బోరున విలపిస్తున్నారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి ఉంటే రేకులు షెడ్ వేసి ఉండేవారు కాదని రామలక్ష్మి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబం ప్రస్తుతం ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నా స్థలంలో రేకుల షెడ్ను తొలగించి నాకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు. సంబంధిత అధికారులు న్యాయం చేయకుంటే ఈనెలలో చెయ్యేరు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళతామన్నారు. దీనిపై కాట్రేనికోన ఎస్ఐ ఐ.అవినాష్‌ను వివరణ కోరగా బాధితుని ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు.

ఒహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్ పున:ప్రారంభం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పల్లె పండుగ విజిబుల్ అసెట్స్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిలకపాడు గ్రామంలో ఉన్న 60 వేల లీటర్ల కెపాసిటీ గల ఒహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్ మరమ్మతుల అనంతరం బుధవారం పున్న ప్రారంభించినట్లు పంచాయతీ కార్యదర్శి చోళ్ళ రాజు తెలిపారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు రూ.4.1 లక్షల పంచాయతీ నిధులతో ఈ పనులను చేపట్టామని తెలిపారు. దీన్ని సర్పంచ్ టివి.సూర్యకుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు తిరుమల్ల నాగపార్వతి, నాయకులు పింద్రా పోచేశ్వరరావు, పాల్గొన్నారు.

జెవివి ప్రాంతీయ వర్క్ షాప్

ప్రజాశక్తి - కాకినాడ

జనవిజ్ఞాన వేదిక ప్రాంతీ య వర్క్‌షాప్ బుధవారం స్థానిక యుటిఎఫ్ హోంలో జరిగింది. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కెఎంఎం ఆర్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌లో తొలుత 'చరిత్రలో సైన్స్' అనే అంశంపై మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడారు. చరిత్ర లో ఏ సందర్భంలో సైన్స్ ఏవిధంగా వ్యవహరించిందనేది వివరించారు. మధ్యాహ్నం సెషన్‌లో మాజీ ఎంఎల్‌సి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ 'జనవిజ్ఞాన వేదిక నిర్మాణం- కొన్ని ప్రాధాన్యతలు' అనే అంశంపై మాట్లాడారు. జూన్ ఒకటవ తేదీ నుంచి జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని తెలిపారు. ఈ వర్క్‌షాపులో ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల వివిధ స్థాయి బాధ్యులు పాల్గొన్నారు.

ఎపిఎస్ఆర్‌టిసి డిపిటిఒగా మూర్తి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

ఎపిఎస్ఆర్‌టిసి డిపిటిఒగా వైఎస్ఎన్.మూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకూ పశ్చిమగోదావరి జిల్లా డిఎంగా సేవలందించారు. బదిలీపై జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, ఆర్‌టిసి ఉద్యోగులు ఆయన్ని కలిసి అభినందనలు తెలిపారు.

యోగాంధ్రపై ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ బుధవారం ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించారు. యోగాంధ్ర ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ఎంఎల్ఎ తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ బుధవారం సీతానగరం పిహెచ్‌సిలో తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఆసుపత్రి రికార్డులు, మందుల నిల్వలు, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సిబ్బంది నిబద్ధతతో విధులను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోకవరంలో ఇంటర్నేషనల్ యోగా డే

ప్రజాశక్తి-గోకవరం

ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల ఆవరణలో బుధవారం ఇంటర్నేషనల్ యోగా డే సందసర్భంగా యోగాను నిర్వహించారు. బుధవారం ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ ఎం.గోవిందు ఆధర్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపిపి సుంకర శ్రీవల్లి, జడ్‌పిటిసి మాజీ సభ్యులు పాలూరి బోసుబాబు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, టిడిపి టౌన్ అధ్యక్షులు పాల్గొన్నారు. అనంతరం ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లిర్పంచారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - చాగల్లు

చంద్రవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా బుధవారం ఎన్‌టిఆర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి లైబ్రేరియన్ కె.సుమన్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం లలితాదేవి రచించిన. చిన్నారి చిట్టి కథలు నుంచి మిత్రద్రోహి, అసలైన వ్యాపారి, గురుద్రోహి కథలను విద్యార్థులతో చదివించారు. అనంతరం పుస్తక సమీక్ష చేశారు . జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. క్యారమ్స్, చెస్ వంటి ఆటలను ఆడించారు. 17 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చాగల్లు శాఖ గ్రంథాలయంలో ఈ సంవత్సరం వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించకపోవడం పట్ల విద్యార్థులు ఆవేదన వ్యక్తపరిచారు. మండల హెడ్ క్వార్టర్‌లో ఉన్న శాఖ గ్రంథాలయం అధికారిని నిడదవోలు గ్రంథాలయానికి ఇన్‌ఛార్జిగా వేయడంతో ఈ ఏడాది వేసవి విజ్ఞాన తరగతులు జరుగలేదు.

మహిళల రక్షణపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెరవలి

మండల కేంద్రం ఎస్సీ కమ్యూనిటీ హాల్ నందు బుధవారం సాయంత్రం నిడదవోలు సర్కిల్ పరిధి పెరవలి పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో మహిళా అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ తిలక్ మాట్లాడుతూ మహిళలు బాలికలపై జరుగుతున్న దాడులు, పోక్సో చట్టం, శక్తి యాప్, గంజాయి, విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు సొసైటీలో మహిళలపై జరుగుతున్న పలు రకాల దాడులపై మహిళలు ఎదుర్కొనే పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.అచ్యుతకుమారి, ఎంపిడిఒ పద్మజ, ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు మహిళలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

22వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

సమస్యల పరిష్కారం కోసం పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 22వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయా మున్సిపల్ కార్యాలయాల ఎదుట జరుగుతున్న సమ్మె శిబిరాల్లో యూనియన్ నాయకులు మాట్లాడారు. తమ సమస్య లు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమకు వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో పెద్దాపురంలో జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షులు సుంకర నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు బాసిన భద్రరావు సుంకర సత్తిరాజు, టి.రాజు, గజ్జ.సతీష్, ఎస్‌కె.బషీర్, సామర్లకోటలో జరిగిన నిరసన కార్యక్రమంలో కార్మికులు రామరాజు, కృష్ణ, రత్నరాజు, రమేష్, మురళీకృష్ణ, సత్యనారాయణ, భూదేవి, నాగార్జున, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి క్రిస్టియన్ మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షునిగా అంబటి

ప్రజాశక్తి-గోకవరం

వైసిపి క్రిస్టియన్ మైనారిటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షులుగా కృష్ణునిపాలెం గ్రామానికి చెందిన అంబటి అబ్రహామ్‌ను నియమించామని వైసిపి జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జి తోట నరసింహం తెలిపారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని కట్టబెట్టిన వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డికి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహానికి, యువ నాయకులు తోట శ్రీరాంజీకి, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం శక్తి వంచనలేకుండా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు, కార్యర్తలు, అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మహానాడులో యువగళం సభ్యుల సేవలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

కడపలో జరుగుతున్న టిడిపి మహానాడులో కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సూచనల మేరకు నియోజకవర్గ యువగళం సభ్యులు సభకు వచ్చే ప్రజలకు వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందిస్తున్నారని యువగళం జిల్లా నాయకులు కాకర్ల సత్యేంద్ర తెలిపారు. సభకు వస్తున్న సమయం నుంచి సభలో సేవలు అందించడం తిరిగి వెళ్లే సమయంలో ఎవరికి ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎంఎల్ఎ చేసిన సూచనల మేరకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. సత్యేంద్రతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన యువగళం కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు ఎండియు ఆపరేటర్ల వినతి

ప్రజాశక్తి - పెరవలి

విధుల నుంచి తొలగించడంతో కుటుంబాలతో రోడ్డున పడ్డామని, తమను ఆదుకోవాలని ఎండియు ఆపరేటర్లు బుధవారం తహశీల్దార్ డి.అచ్యుతకుమారి, సిఎస్‌డిటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 18 గ్రామాలకు 15 మంది ఆపరేటర్లు ఉన్నామన్నారు ఒకటో తేదీ నుంచి విధుల నుంచి తొలగించడంతో రోడ్డు పడతామన్నారు. గత ప్రభుత్వం ఆపరేటర్లకు రూ.18వేలు వేతనం ఇచ్చేదన్నారు. చాలీచాలని ఈ జీతంతోనే కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. కూటమి ప్రభుత్వం తమను తొలగించడంతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

మండలంలో చురుగ్గా ఉపాధి పనులు

ప్రజాశక్తి - చాగల్లు

ఇరిగేషన్ కెనాల్స్, డ్రైన్స్ త్రవ్వకంతో ఇటు ఉపాధి శ్రామికులు డ్రైన్ల ప్రక్షాళన జరుగుతుంది. చాగల్లు గ్రామం లో కొవ్వడ కాలువ పూడిక తీయుట వలన గట్లు పటిష్టం గాను, ముంపు ప్రాంతం వైపు గట్లపై మట్టి వేయుట వలన గట్లు బలముగా ఉండుటకు అవకాశం ఉంది అని మండల అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డి రమణయ్య అన్నారు . ఆయన మాట్లాడుతూరీ ఈ డ్రైన్ లో మేటలు వేసుకుపోయిన మట్టిని తొలగించి గట్లను పటిష్టం చేస్తున్నారు. ఈ పని ఈ గ్రామానికి ఎంతో ఉపయోగ కరముగా ఉన్నదని రైతులు కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలం వ్యాప్తంగా 20 కిలోమీటర్ల మేర కాలువలు డ్రైన్లు పూడిక తీయుట పనులు ముమ్మరంగా జరుగుతున్నవనీ వీటి ద్వారా 20వేల పని దినాలు అదనంగా ఉపాధి శ్రామికులుకు కల్పించ బడుతుంది మండల అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి. రమణయ్య తెలియజేశారు.

పారిశుధ్య వాహనాల కొనుగోలు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు పంచాయతీలో గృహాల నుంచి చెత్తను సేకరించేందుకు రూ.3.60 లక్షల పంచాయతీ నిధులతో రెండు కొత్త గ్రీన్ వెహికల్స్‌ను కొనుగోలు చేశామని ఇఒపిఆర్‌డి ఎన్.శ్రవణ్‌కుమార్ తెలిపారు. వీటి ద్వారా చిన్న రోడ్లలో కూడా గృహాల నుంచి చెత్త సేకరణకు అనువుగా ఉంటుందన్నారు. వాహనాలను సర్పంచ్ వి.మనశ్శాంతి ప్రారంభించారు.



వాహనాలను ప్రారంభిస్తున్న సర్పంచ్

వాహన డ్రైవర్లకు తాళాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ క్లాప్ మిత్రలు బాధ్యతాయుతంగా, ప్రజల మన్ననలు పొందేలా చూడాలన్నారు. గ్రామాన్ని క్లీన్ విలేజ్‌గా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి, పంచాయతీ కార్యదర్శి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత పంచాయతీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి సర్పంచ్, టిడిపి నాయకులు ఆళ్ల హరిబాబు, కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కిశోర బాలికలకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం పిహెచ్‌సి పరిధిలో ఉన్న ఉండ్రాజవరం-2 సచివాలయం పరిధిలో కిశోరబాలికలకు బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వి.ప్రసాద్ మాట్లాడారు. యుక్తవయస్సులో శరీరంలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తద్వారా రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాలికలకు శానిటరీ న్యాప్కిన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కెడివిఎల్.కుమారి, ఆశాజ్యోతి, విజయలక్ష్మి, సత్యవతి, భాగ్యలక్ష్మి , అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

చాగల్లు : మండలంలోని చాగల్లు కాపు కళ్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం బాలికలకు పలు విషయాలపై ఎస్ఐ కె.నరేంద్ర అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం మండలం, ఓదూరు గ్రామం, డో.నెం.5-38రు కాపురస్తులు పొట్లకాయల కృష్ణమూర్తి గారి కుమారుడు **పొట్లకాయల చంద్రశేఖర్** గారు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా యొక్క పాస్‌పోర్ట్ నెం. **S6409344,** తేది 27-11-2018 కలది నేను ది.20-04-2025 తేదీన జిరాక్స్ నిమిత్తం మా ఇంటి నుండి ఓదూరు గ్రామం సెంటర్‌లో గల జిరాక్స్ షాపుకు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టును తీసుకొని వెళ్ళుచుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. కావున ఈ పాస్‌పోర్టు దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

పొట్లకాయల చంద్రశేఖర్
S/o. కృష్ణమూర్తి, ఓదూరు గ్రామం, సెల్: 9553277437

దస్తావేజులు పోయినవి

తూ॥గో॥జిల్లా, కొవ్వూరు మండలం, ఆరికిరేవుల గ్రామ కాపురస్తులు మట్టా సూర్యచంద్రరావు గారి దత్తత కుమారుడు అంతర్వేది అను నాకు ఆరికిరేవుల గ్రామంలో ఆర్.యస్. నెం. 57 రు, చ॥గ॥ 242 లు స్థలము, అందున ప్రస్తుత డోర్ నెం. 1-120/3 రు గల ఆర్.సి.సి. డాబా ఇల్లు కలదు. సదరు నా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజులు 1) ది. 09-08-2001వ తేదీన కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో దస్తావేజు నెం. 1895/2001 గా రిజిష్టర్డు కాబడిన దఖలు దస్తావేజు, 2) ది. 02-07-1949వ తేదీన కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో దస్తావేజు నెం. 1454/1949 గా రిజిష్టర్డు కాబడిన క్రియ దస్తావేజు, 3) ది. 25-06-1929వ తేదీన కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో దస్తావేజు నెం. 1965/1929 గా రిజిష్టర్డు కాబడిన క్రియ దస్తావేజు వెరశి మూడు ఒరిజినల్ దస్తావేజులు గల కవర్ ది. 28-05-2025వ తేదీన ఉదయం సుమారు గం॥ 11.00ల సమయంలో నేను నా మోటారు సైకిల్‌పై కొవ్వూరు పట్టణం, మెయిన్ బజార్‌లో జిరాక్స్ తీయించుకుని వస్తుండగా పోయినది. అంతట నేను సదరు జిరాక్స్ వద్ద, దారి మార్గములో ఎంక్వయిరీ చేసిననూ, నాకు సదరు దస్తావేజులు గల కవర్ దొరికియుండలేదు. కావున సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు: మట్టా అంతర్వేది,
తండ్రి: మట్టా సూర్యచంద్రరావు
డోర్ నెం. 1-120/3, ఆరికిరేవుల
కొవ్వూరు మండలం, తూ॥గో॥జిల్లా
సెల్: 9515828552

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
I.P. No. 13/2025

Between:
Tothadi Uday Kumar, S/o. Venkata Satya Rao, aged 28 years, Calling Nil, resident of D.No. 8-252, Industrial Colony, Rajamahendravaram, E.G.Dt.,
...Petitioner

AND

1. Bathina Sai Durga Prasad, S/o. Chandi Babu, aged 40 years, resident of D.No. 8-252, Opp: Gudala Raju's House, Industrial Colony, Mallayyapeta, Rajamahendravaram, E.G.Dt.,
2. Vada Karuna, W/o. Appanna, aged 35 years, resident of D.no. 8-252, Opp: Gudala Raju's House, Industrial Colony, Mallayyapeta, Rajamahendravaram, E.G.Dt.,
3. Naralasetti Mani, W/o. Ramana, aged 35 years, resident of Hosanna Mandiram, Kallupaka Backside house, Industrial Colony, Mallayyapeta, Rajamahendravaram, E.G.Dt.,
4. Kodavati Durga Devi, W/o. Sridhar, aged 30 years, resident of Opp: Board High School, Anganwadi Opposite House, Saibaba Temple Street, Bhavanipuram, Rajamahendravaram, E.G.Dt.,
5. Bojja Durga Hari Babu, S/o. Chitti Babu, aged 35 years, resident of Beside Seethamma House, Industrial Colony, Mallayyapeta, Rajamahendravaram, E.G.Dt.,
6. Akula Uma Sankar, Father's name Not known, aged 30 years, resident of 2nd House, Water Tank Street, V.V.Nagar, Ganapathi Nagar, Rajamahendravaram, E.G.Dt.,
7. Simhadri Veera Babu, S/o. Bhadra Rao, aged 38 years, resident of Beside Water Tank Street, Bhavanipuram, Samadula Street, Rajamahendravaram, E.G.Dt.,
8. Siddhantham Kumari, W/o. Mangacharyulu, aged 35 years, resident of D.No. 115-15-117, Vijaya Medical Shop Opposite Street, Official Colony, Konthamuru Village, Rajamahendravaram Rural Mandal, E.G.Dt.,

...Respondents

పై గ్రంధములో పిటీషనరు/ డెటరు తనకు గల అప్పులు చెల్లించు శక్తి లేదని ఇన్సాల్వెంటుగా/ దివాళాదారుగా డిక్లేరు చేయమని కోరుచూ పై పిటీషను దాఖలు చేసియున్నారు. కావున పైన తెలిపిన రెస్పాండెంట్సుకు గాని, ఎవరికైనా పై గ్రంధములో ఏమైనా అభ్యంతరములు ఉన్న ఎడల **ది. 03-7-2025వ తేదీన** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై వారికి గల అభ్యంతరములు పై కోర్టు వారి ఎదుట మనవి చేసుకోవలెను. కావున ఎల్లరుకు తెలియపర్చడమైనది.

జె.బి.ఎస్.బాపూజీ
రాజమండ్రి అడ్వకేట్, రాజమండ్రి
28-5-2025 సెల్: 8309867728